



వీర జవాన్‌కు జగన్ నివాళి
(వివరాలు మెయిన్‌లో)

లెక్క'ల మాస్టార్లు..!

సొంత ఆదాయంపై కొందరు కార్పొరేటర్ల దృష్టి

- అడ్డమైన పనులతో అక్రమార్జన
- భవనాల నుంచే అధిక వసూళ్లు
- బెటర్‌మెంట్ చార్జెస్ ఎగవేత వెనుక కీలక నేతలు
- అడ్వర్టయిజ్‌మెంట్‌లలోనూ చేతివాటం
- కార్పొరేషన్ పాలకవర్గంలో అవినీతి దందా
- టీడీపీలోకి చేరిన వారిలో ముగ్గురిది ఇదే పంథా



ఎంపీడీఓ ఆఫీస్ సమీపంలో నిర్మిస్తున్న ఈ భవనం విషయంలో రూ.10లక్షలు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి

నాలుగేళ్లలో 450కిపైగా బిల్డింగ్‌లు

ఈ పాలకవర్గం ఏర్పడ్డాక నగరంలోని 50 డివిజన్లలో సుమారు 450 భవనాల వరకు అప్రూవల్ ఇచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వీటిలో 100కు పైగా చార్జిషీట్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. అది కూడా చాలా తక్కువేనని సమాచారం. వీటిలో చాలా వరకు పాలకవర్గం కీలక నేతలు, అధికారుల కుమ్మక్కుతో చార్జిషీట్‌లు కూడా పడలేదని తెలుస్తోంది. ఈ భవనాల్లో 400వరకు సెల్లార్, డీవియేషన్, సెట్‌బ్యాక్స్ లేకుండా కట్టినవే ఉండటం గమనార్హం. వీటిలో 350 బిల్డింగ్‌లలో పాలకవర్గంలో కీలక నేతలు, కార్పొరేటర్లు, అప్పటి వైసీపీ నేతలు, ప్రస్తుత అధికార టీడీపీ నేతలు జోక్యం చేసుకున్నట్లు సమాచారం.

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): నగర పాలకులు అభివృద్ధిని మరచి, సొంత ఆదాయం వృద్ధిపై దృష్టి పెట్టారు. కార్పొరేషన్ కంటే కార్పొరేటర్లు, కీలక ప్రజాప్రతినిధులకే అధిక ఆదాయం వస్తోందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. నగరంలో నిర్మించే భవనాల నుంచే ముడుపులు ప్రత్యేకంగా అందుతుంటాయి. పాలకవర్గంలో ఓ ముగ్గురు నేతలు అధిక ఆదాయం పొందారనే ప్రచారం జరుగుతోంది. ఇక మిగిలిన కార్పొరేటర్లు తామేం తక్కువ కాదన్నట్లు అక్రమ సంపాదనే పరమావధిగా కాలం గడిపేస్తున్నారు. కొందరు అధికారులే సంబంధిత నేతలకు లెక్కగట్టి పైసలు ఇచ్చుకుంటూ వచ్చారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత అధికారపార్టీలోని కొందరు సైతం బిల్డింగ్‌లపైనే పడుతున్నారట.



హౌసింగ్‌బోర్డులో ప్రధాన రహదారిలో కొత్తగా ఏర్పాటు చేసిన లాలీపాప్‌లు

అడ్వర్టయిజ్‌మెంట్‌లలోనూ చేతివాటం...

కార్పొరేషన్‌కు టౌన్‌ప్లానింగ్ నుంచి అధిక ఆదాయం గండి పడటానికి పాలకవర్గ నేతలే కారణంగా ఉన్నట్లు కనిపిస్తోంది. నగరపాలికలో గత మూడేళ్లుగా అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డుల విషయంలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నగరంలో హోర్డింగ్‌లు, డివైడర్ల మధ్య ఏర్పాటు చేసే లాలీపాప్‌లు, డిజిటల్ బోర్డుల నుంచి అడ్వర్టయిజ్‌మెంట్‌లు ప్రదర్శిస్తారు. ఇలా ఏర్పాటు చేసేవారు కార్పొరేషన్‌కు డబ్బు చెల్లించాలి. కానీ ఇక్కడ ఒకటి, రెండు సంస్థల కనుసన్నల్లోనే అడ్వర్టయిజ్‌మెంట్ బోర్డులు నడిచేలా వ్యవహారం నడుస్తోంది. ఇందుకు పాలకవర్గంలో ఇద్దరు కీలక నేతలు పూర్తి స్థాయి సహకారం అందిస్తున్నట్లు సమాచారం. హోర్డింగులు, లాలీపాప్‌ల నిర్వహణకు దాదాపు 10 సంస్థలు దరఖాస్తు చేసుకుంటే కేవలం ఒక సంస్థ ఫైల్‌కే టౌన్‌ప్లానింగ్ అధికారులు అప్రూవల్ ఇచ్చినట్లు సమా చారం. గత కొన్నేళ్లుగా ఒకే సంస్థకే అధికారులు వంతపాడుతుండటం పలు సందేహాలకు తావిస్తోంది. ఏటా కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ఫీజు చెల్లించకుండా కొందరు పంచుకుంటున్నట్లు సమాచారం. తాజాగా సంబంధిత సంస్థకు ఫీజు చెల్లించలేదంటూ నోటీసు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారట. ఇక సూర్యానగర్, హౌసింగ్‌బోర్డులో కొత్తగా లాలీపాప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డివైడర్ల మధ్యలో పచ్చదనం, సుందరీకరణ దేవుడెరుగు...లాలీపాప్‌లతో దుర్లభంగా మారిందని నగర ప్రజలు మండిపడుతున్నారు.

కార్పొరేటర్ల హవా...

నగరంలోని కమలానగర్ పరిధిలో ఉండే ఓ కార్పొరేటర్ కొత్త భవనం నిర్మిస్తుంటే చాలు తన అనుచరున్ని పంపి డబ్బు వసూలు చేయించుకొస్తాడు. అధికారులు అడిగితే మాట్లాడుకున్నాం...వదిలేయండి అని చెబుతారట. కమర్షియల్ ఏరియా కావడంతో ఈ నాలుగేళ్లలో బాగానే వెనకేసుకున్నట్లు సమాచారం. ఓ కార్పొరేటర్ తన పరిధిలో రోడ్డు పక్కనున్న బంకుల నుంచి బిల్డింగ్‌ల వరకు ప్రతి దాంట్లోనూ ముడుపులు కావాలంటారు. అటు కాంట్రాక్టర్‌గా కూడా చలామణి అయ్యే ఓ కార్పొరేటర్ బిల్డింగ్‌ల నుంచి బాగానే వసూలు చేస్తుంటాడని సమాచారం. ఆయన పరిధిలో ఓ పాత భవనానికి రూ.లక్ష పన్ను ఉంటే అది చెల్లించడానికి ఇంకా టైం పడుతుందంటూ ఈ కార్పొరేటర్ చెప్పుకొస్తున్నారట. నగరపాలికతో అనుబంధమున్న మూడో రోడ్డుకు చెందిన ఓ నాయకుడు బిల్డింగ్‌ల పై ప్రత్యేక దృష్టి సారిస్తారట. విద్యుత్ నగర్ సర్కిల్ పరిధిలోని ఓ కార్పొరేటర్ పాలకవర్గంలో టాప్ త్రీలో ఒక నేత అనుచరుడిగా ముద్ర వేసుకున్నారు. కొన్ని బిల్డింగ్‌లలో నేరుగా ను, మరికొన్ని వ్యవహారాల్లో ఆ నేతతో చెప్పించుకుని వసూళ్లు చేస్తుంటారు. కలెక్టరేట్‌కు సమీపంలో ఉండే ఓ కార్పొరేటర్ శ్మశానవాటికలో కంపలు తీయాలన్నా కమీషన్ పుచ్చుకుంటారట. ఇంకా కొందరు కార్పొరేటర్లు భవనాలు, భూముల విషయాల్లో తమ హోదాతో పైసల కోసం కక్కుర్తి పడుతున్నారు. కొందరి కార్పొరేటర్ల భర్తలు, వారి కొడుకులు సైతం దందాల్లో చక్రం తిప్పుతున్నారు.

అధికారంలో ఉన్నాం కదా..

నగరంలో ఎక్కడ పెద్ద బిల్డింగ్ కడుతున్నా అధికారపార్టీకి చెందిన ఓ నేత వాలిపోతుంటారు. అధికారంలో ఉన్నది తామేననే సంకేతమిచ్చి బిల్డింగ్ యజమాని ద్వారా లేదా అధికారుల మధ్యవర్తిత్వంతో ముడుపులు పుచ్చుకుంటారు. తాజాగా కమలానగర్‌లో డీసీఎంఎస్ కార్యాలయ సమీపంలో ఐదు సెంట్లలోనే సెల్లార్ తీశారు. ఈ విషయంలోనూ ఆయనే జోక్యం చేసుకున్నారు. రూ.లకారాల్లోనే చేతులు మారినట్లు సమాచారం. ఇలాంటివి చాలానే ఉన్నాయి. ఇక టీడీపీలోకి మారిన వారిలో ముగ్గురు కార్పొరేటర్లు వసూళ్లలో బిజీగానే ఉన్నారు. ఒకాయన 14శాతం బెటర్‌మెంట్ చార్జెస్ ఎగ్గొట్టిన ఓ బిల్డింగ్ నుంచి ఏకంగా రూ.7లక్షలు లబ్ధి పొందినట్లు సమాచారం.

టాప్‌లో ఆ ముగ్గురూ....

నగరపాలికలో ప్రస్తుతమున్న పాలకవర్గం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయింది. ఇన్నేళ్ల కాలంలో అనంతపురం కార్పొరేషన్ పరిధిలో అత్యధిక సంపాదనలో పాలకవర్గంలోని ఓ ముగ్గురు టాప్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ ముగ్గురూ పాలకవర్గంలో కీలక నేతలు కూడాను. అనేక ఫైళ్ల విషయంలో వ్యవహారం వీరి చుట్టూనే తిరుగుతుంటుంది. ఈ నాలుగు సంవత్సరాలలో ఎక్కువ శాతం నగరంలో నిర్మించే భవనాల నుంచే వీరికి ఆదాయం వచ్చి ఉంటుందని సమాచారం. భవనం అక్రమ కట్టడమా..? ఎంత డీవియేషన్ ఉంది..?, అదనంగా ఎన్ని అంతస్తులు నిర్మించారు..? ఎన్ని సెంట్లకు సెల్లార్ తీశారు..? లాంటి విషయాలపై దృష్టి సారించి ఆ బిల్డింగ్ సైజు ఆధారంగా ముడుపులు పుచ్చుకున్నారనే ఆరోపణలున్నాయి. కొన్ని భవనాలకు(నాన్ అప్రూవల్ లేఅవుట్లలో) నామినల్ ఫీజులు వ రాత్ర వే ం చెల్లించి 14శాతం బెటర్‌మెంట్ చార్జీలకు ఎగనామం పెట్టారు. ఇలాంటి వాటిలో ఈ కీలక నేతల జోక్యం అధికంగా ఉందని సమాచారం. గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారాలు చక్కబెట్టి ఆమ్యామ్యాలు అందుకునేవారని తెలిసింది.

బిల్డింగ్‌లకు రూ.1.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. వీరిలో ఒకాయన నేరుగా తన అధికార దర్పంతో అధికారులను ఆదేశించి అటు వైపు వెళ్లకుండా చూస్తారు. మరొకాయన తన పవర్‌తో అందరినీ కంట్రోల్ చేస్తారు. మరో నేత కొన్ని తాను చక్క దిద్దితే, మరికొన్ని భర్త చక్కబెడుతుంటారట. వీరికి రాని ఆదాయంపై కౌన్సిల్ సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తుంటారు.



కమలానగర్‌లోని డీసీఎంఎస్ కార్యాలయ సమీపంలోని ఐదుసెంట్లకే సెల్లార్ తీసిన వైనం

ప్రొటోకాల్ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశం
17న జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి గవర్నర్ రాక
15, 16, 17న మంత్రి లోకేశ్ పర్యటన
16న రైల్వే మంత్రి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ ...



అనంతపురం టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): గవర్నరు, మంత్రులు జిల్లా పర్యటన నేపథ్యంలో ప్రొటోకాల్ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఈనెల17న గవర్నర్ అబ్దుల్ నజీర్ జేఎన్‌టీయూ స్నాతకోత్సవానికి హాజరవుతున్నారన్నారు. ఆ రోజు ఉదయం రైలు ద్వారా అనంతపురం చేరుకుంటారని, కార్యక్రమంలో పాల్గొని అదే రోజు సాయంత్రం రైలు లోనే వెళ్తారన్నారు. గవర్నర్ పర్యటన కార్యక్రమానికి మొత్తం జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తారన్నారు. గవర్నర్ పర్యటన సందర్భంగా అధికారుల టీమ్, లైజన్ అధికారులు, వాహనాల కాన్వాయ్, అంబులెన్స్, భోజన ఏర్పాట్లు జాగ్రత్తగా చేయాలని ఆదేశించారు. జేఎన్‌టీయూలో ముందురోజే డ్రస్ రిహార్సిల్స్ చేయాలని, సెక్యూరిటీ ముందుగానే ఏర్పాటు చేయాలని సూచించారు.

● మూడ్రోజులు మంత్రి లోకేశ్ పర్యటన

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనంత జిల్లాలో మూడ్రోజులు పర్యటించనున్నారని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 15న మధ్యాహ్నం హెలికాప్టర్‌లో గుత్తికి చేరుకుంటారన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని అదే రోజు రాత్రికి గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో బస చేస్తారన్నారు. 16న ఉదయం 10 గంటలకు బేతపల్లి గ్రామం వద్ద రెన్యూ విండ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారన్నారు. అదేరోజు రాత్రికి అనంతపురంలో ఓ వివాహ కార్యక్రమానికి మంత్రి హాజరవుతారన్నారు. మంత్రి పర్యటన ప్రాంతాల్లో పకడ్బందీగా ఏర్పాట్లను చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే 16న రైల్వేశాఖ మంత్రి, రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు జిల్లాకు వస్తున్నారని అక్కడ అవసరమైన ప్రొటోకాల్ ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యే కుమార్తె వివాహానికి సంబంధించి హాజరయ్యే వీఐపీలకు చేపట్టే ఏర్పాట్లకు అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు ఇన్‌చార్జ్‌గా ఉంటారని, గవర్నర్ పాల్గొనే జేఎన్‌టీయూ కార్యక్రమానికి సంబంధించి హెచ్ఎన్ఎస్ఎస్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జునుడు ఇన్‌చార్జ్‌గా కొనసాగుతారన్నారు. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర ఏర్పాట్లకు హెచ్చెల్సీ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి వీఐపీల పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషాద్రిశేఖర్, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు యుగేశ్వరీదేవి, తహసీల్దార్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోజూ 1.5 లక్షల మందికి పని కల్పించాలి

డ్వామా పీడీ సలీంబాషా



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, మే 13(ఆంధ్రజ్యోతి): సీజన్‌లో రోజూ 1.5లక్షల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలనీ, ఆ దిశగా క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా పని చేయాలని ఉపాధి హామీ సిబ్బందికి డ్వామా పీడీ సలీంబాషా సూచించారు. ఉపాధి పథకం అమలుపై స్థానిక తన చాంబర్‌నుంచి మంగళవారం ఏపీడీ సుధాకర్ రెడ్డితో కలిసి పీడీ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. విస్తృతంగా ఉపాధి పనులు కల్పించి, వలస వెళ్లకుండా చూడాలన్నారు. నీటికుంటల తవ్వకం లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించడంలో వెనుకబడిన మండలాలు, గ్రామ పంచాయతీల ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యం వీడకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హత్య కేసులో గుమ్మనూరు నారాయణ అరెస్ట్



నారాయణ అరెస్టు వివరాలు తెలియజేస్తున్న ఏఎస్పీ హుసేన్ పీరా

గుంతకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ రాయలసీమ మాజీ అధ్యక్షుడు, ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్య కేసులో గుమ్మనూరు నారాయణను నిందితుడిగా గుర్తించి ఆలూరు పోలీసులు అరెస్టు చేశారు. భూ తగాదాల కారణంగా గత నెల 27న పట్టణ శివారులో లక్ష్మీనారాయణను కొందరు వ్యక్తులు కాపుకాచి, కారును టిప్పరుతో ఢీకొట్టి, కొడవళ్లతో నరికి చంపిన సంగతి విదితమే. ఈ కేసు విచారణ చేపట్టిన ఆలూరు పోలీసులు 10 మందిని నిందితులుగా పేర్కొని, ఈ నెల రెండో తేదీన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఈక్రమంలోనే ఆలూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు నారాయణను మంగళవారం ఉదయం ఆలూరు పోలీసులు భారీ బందోబస్తుతో గుమ్మనూరు గ్రామానికి వెళ్లి అరెస్టు చేసినట్లు అడిషనల్ ఎస్పీ హుసేన్‌పీరా వెల్లడించారు. ఏఎస్పీ ఆలూరులో విలేకరులతో మాట్లాడుతూ లక్ష్మీనారాయణ హత్య విషయంగా గుమ్మనూరు నారాయణ సెల్‌ఫోన్ కాల్‌డేటాను పరిశీలించగా అతడి ప్రమేయం కూడా ఉన్నట్లు సాంకేతిక ఆధారాలు లభించాయన్నారు. హత్యకు గురైన చిప్పగిరి లక్ష్మీనారాయణకు, గుమ్మనూరు నారాయణకు రైల్వే టెండర్ల విషయంగా విభేదాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ కారణంగా లక్ష్మీనారాయణను హత్య చేయడానికి పెద్దన్న తదితర ప్రధాన నిందితులకు గుమ్మనూరు నారాయణ ఆర్థిక సాయం చేసినట్లు పేర్కొన్నారు. హత్యకు ఉపయోగించిన టిప్పర్‌ను లీజ్‌కు తీసుకునేందుకు గుమ్మనూరు నారాయణ రూ. 2 లక్షలు, ఖర్చుల కోసం రూ. 1.5 లక్షల ఆర్థిక సాయం చేసినట్లు తేలిందన్నారు. దీంతో గుమ్మనూరు నారాయణ పేరును నిందితుల జాబితాలో చేర్చి అరెస్టు చేశామన్నారు. అతడి నుంచి రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కోర్టుకు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా ఈ హత్య కేసులో మరి కొందరి హస్తం ఉండే అవకాశం ఉన్నందున సమగ్ర విచారణ జరిపి, అందరినీ త్వరలో అరెస్టు చేస్తామని వివరించారు.

ఉద్యోగం ముఖ్యం.. వేతనం కాదు..

ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, మే 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంలో చేరేటపుడు వేతనం గురించి ఆలోచించవద్దని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి సూచించారు. స్థానిక శ్రీవాణి హైస్కూల్‌లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టపడి చదివి ఖాళీగా కూర్చునే బదులు ఏదైనా ఉద్యోగంలో చేరితే కుటుంబానికి ఆసరాగా నిలిచిన వారవుతారన్నారు. వేతనం తక్కువ అయినా.. ఉద్యోగంలో ప్రతిభ చూపితే ఉన్నత స్థానాలకు చేరవచ్చన్నారు. భారీ ప్యాకేజీ ఇస్తేనే ఉద్యోగంలో చేరతామనే ఆలోచనను విరమించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీవాణి విద్యాసంస్థల చైర్మన్ గంగాధర్, నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, పవన్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఊరుగాని ఊరిలో ఉరి
కర్నూలు జిల్లా నందవరం కోడలు జీవితం విషాదాంతం
7

బంగారు బిడ్డలు..!

జేఎన్‌టీయూలో బీటెక్ విద్యార్థులకు బంగారు పతకాలు

ఆరు పతకాలతో అదరగొట్టిన పూజిత్‌కుమార్ రెడ్డి

17న రాష్ట్ర గవర్నర్ నుంచి అందుకోనున్న విద్యార్థులు



అనంతపురం సెంట్రల్, మే 13(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించారు. 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా వీటిని అందుకోనున్నారు. 2024-25 సంవత్సరానికి బీటెక్ టాపర్స్‌గా ఏడుగురు విద్యార్థులు నిలిచారు. అందులో ఐదుగురు బాలికలు బంగారు పతకాలను సాధించడం గమనార్హం. మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థి నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధించారు. జేఎన్టీయూ పులివెందుల కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పతకాలకు ఎంపికయ్యారు. వర్సిటీ అనుబంధ ప్రైవేట్ కళాశాలల నుంచి 12మంది బంగారు పతకాలు అందుకోనున్నారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

అనంతపురం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల మెడల్స్ వివరాలు..

విద్యార్థి	బ్రాంచ్	సీజీపీఏ	మెడల్స్
నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	6
సుప్రియ	కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్	87.62	4
గువ్వల వాల్మీకి హరిత	సివిల్ ఇంజనీరింగ్	86.48	3
పటాన్ ఫహద్ అలి	ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్	85.51	3
శ్రీ వైష్ణవి	ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యునికేషన్	84.14	2
జాహ్నవి	కెమికల్ ఇంజనీరింగ్	84.78	2
పి.వనతి	మెకానికల్ ఇంజనీరింగ్	87.73	1

ప్రభుత్వ రంగ ఉద్యోగిగా..



ప్రభుత్వ రంగంలో ఉన్నతస్థాయి ఉద్యోగిగా పేదలకు సేవలందించాలన్నది అమ్మ, నాన్న ఆకాంక్ష. వారి కలలు నెరవేర్చేలా ఏపీపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నా. మాది నెల్లూరు నగరం. అమ్మ నాగలక్ష్మి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. నాన్న కరుణానిధి ప్రైవేటు ఉద్యోగి. విద్యార్థులను ప్రోత్సహించేలా కళాశాల అధికారులు ప్రణాళిక బద్ధంగా సెమినార్స్, ప్రాజెక్టులు నిర్వహించి నైపుణ్యాలను వెలికితీస్తున్నారు.

-శ్రీ వైష్ణవి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, రెండు గోల్డ్ మెడల్స్

ఉన్నత ఉద్యోగమే లక్ష్యం



ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లో అత్యున్నత స్థాయి ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. మాది కడప జిల్లా యర్రగుంట్ల. అమ్మ మంజుల గృహిణి. నాన్న బ్రహ్మంరెడ్డి ప్రైవేట్ కంపెనీలో రోజుకూలీగా పని చేస్తారు. గత డిసెంబరులో కళాశాలలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహిం చారు. ఇంటర్వ్యూలో ప్రతిభ కనబర్చడంతో ఉద్యోగానికి ఎంపికయ్యా. రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎల్అండ్‌టీ కంపెనీలో ట్రైనీ ఇంజనీర్‌గా పని చేస్తున్నా.

- నంద్యాల పూజిత్ కుమార్ రెడ్డి, మెకానికల్ ఇంజనీరింగ్, ఆరు గోల్డ్ మెడల్స్

సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా..



గూగుల్ వంటి సంస్థల్లో అంతర్జాతీయ స్థాయిలో సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా పని చేయాలన్న ప్రణాళిక పెట్టుకున్నా. మాది చిత్తూరు జిల్లా, ఐరాల మండలం, బీఎస్ అగ్రహారం. అమ్మ ఉషారాణి, నాన్న శ్రీనివాస్ ఇద్దరూ కిరాణాకొట్టు నిర్వహిస్తున్నారు. వారి ఆశలు నెరవేర్చేలా బీటెక్‌లో మంచి సీజీపీఏను సాధించా. కళాశాలలోని మా విభాగాధిపతి డాక్టర్ కేఎఫ్ భారతి ప్రోత్సాహం మరువలేనిది. రూ.6లక్షల వార్షిక వేతనంతో బెంగళూరులోని డెలాయిట్ కంపెనీలో అనలిస్టుగా పనిచేస్తున్నా.

- తయ్యూరు సుప్రజ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, నాలుగు గోల్డ్ మెడల్స్

గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నా



ఆంధ్రా యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతూ.. ఏపీపీఎస్సీ గ్రూప్స్, ఎస్ఎస్సీ జేఈ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. మాది అనంతపురం. అమ్మ గౌరి గృహిణి. నాన్న కృష్ణ ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. బీటెక్ ప్రథమ సంవత్సరం తోటి విద్యార్థుల్లాగే సాధారణ సీజీపీఏ వచ్చింది. అయితే మా విభాగాధిపతి అజిత ప్రోత్సాహంతో చివరి సంవత్సరం వచ్చేసరికి 86.48 తగ్గకుండా మెరిట్‌లో పాస్ అవుతూ వచ్చా. కళాశాలకు ఎంతో రుణపడివుంటా.

- గువ్వల వాల్మీకి హరిత, సివిల్ ఇంజనీరింగ్, మూడు గోల్డ్ మెడల్స్.

ఐఈఎస్‌లో ర్యాంకే లక్ష్యం



ఐఏఎస్, ఐపీఎస్ తరహాలో ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసెస్(ఐఈఎస్)లో ర్యాంక్ సాధించాలని లక్ష్యాన్ని పెట్టుకున్నా. మాది కదిరి పట్టణం. అమ్మ ముంతాజ్, గృహిణి. నాన్న మహబాషా టైలర్‌గా పని చేస్తున్నారు. మహారాష్ట్ర పూణేలోని టీసీఎస్‌లో పని చేస్తున్నా. కళాశాలలో అనుభవం కల్గిన ఫ్యాకల్టీ బోధనతో విద్యార్థులు సులువుగా మెరిట్‌ను సాధిస్తున్నారు. ప్రైవేట్ సంస్థలతో ఎంఓయూలు చేసుకుని క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ ద్వారా మాలాంటి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

- పటాన్ పహద్ అలి, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మూడు గోల్డ్‌మెడల్స్

నేటి నుంచి దుర్గాంబ జాతర

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



మూలవిరాట్ నసనకోట దుర్గాంబ

రామగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నసనకోట సమీపంలో వెలసిన దుర్గాంబ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 64 సంవత్సరాల తర్వాత జాతర నిర్వహిస్తుండటంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం నుంచి 18వతేదీ వరకు జాతరను నిర్వహించనున్నారు. ఈ జాతర రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ ఆధ్వర్యంలో నసనకోట, వెంకటాపురం, గంగంపల్లి గ్రామాల ప్రజల సహకారంతో నిర్వహించనున్నారు. దాదాపు రూ.కోటికిపైగా వెచ్చించి ఇక్కడ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. బుధవారం హరియాన్ చెరువు నుంచి పాలకావిడి వచ్చే కార్యక్రమం నిర్వహిస్తారు. అదే రోజు దుర్గాంబ, ముత్యాలమ్మ గ్రామ దేవతలకు దుర్గాంబ చెలిమలో గంగపూజ నిర్వహిస్తారు. 15న ఉత్సవ విగ్రహాలను మూడు గ్రామాలలో ఊరేగించనున్నారు. 16న అభయాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ జరుగుతుంది. 17న దుర్గాంబమ్మకు ముత్తవకుంట్ల గ్రామం సరిపూటి వారు అఖండ జ్యోతిని సమర్పిస్తారు. సాయంత్రం మూడు గ్రామాల నుంచి జ్యోతులతో వచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అదే రోజు రాత్రి కురుబ బెల్లంవారు వండిన బోనాన్ని బళ్లారి వారు తీసుకుని పెద్దమాదిగలు అందరు కలిసి ఊరేగింపుగా గుడి ప్రాంగణానికి చేరుకుంటారు. ఆదివారం అమ్మవారికి పెద్దఎత్తున జ్యోతులు, బోనాలు సమర్పించి కార్యక్రమాలు ముగిస్తారు. ఈ ఐదు రోజుల పాటు అక్కడ హోమాలు, యజ్ఞాలు కూడా నిర్వహించనున్నారు. దుర్గాంబ జాతర చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహించేందుకు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, గ్రామస్థులు కృషి చేస్తున్నారు.



గుండుకింద వెలసిన దేవాలయం



ప్రతిష్ఠించనున్న అభయాంజనేయ స్వామి విగ్రహం

సొంతూరిలోనే పరిశ్రమ పెట్టండి

- పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములవ్వండి
- మంత్రి సవిత పిలుపు
- పెనుకొండ వద్ద ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు భూమిపూజ



ఎంఎస్ఎంఈ పార్కుకు భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఎక్కడెక్కడో పరిశ్రమలు ఏర్పాటు చేసే బదులు.. సొంతూరులోనే పెట్టాలని ఔత్సాహికులు, యువతకు బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. పుట్టిన ప్రాంత అభివృద్ధిలో భాగస్వాము లు కావాలన్నారు. పెనుకొండ సమీపంలోని రొద్దం ప్లేట్లపై 59.37 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కుకు మంత్రి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ పార్కులో తొలి విడత 20 ఎకరాల్లో చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 115 పరిశ్రమలకు ఏడు సెంట్ల చొప్పున భూమి కేటాయిస్తున్నామ న్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పారిశ్రామికరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా అడ్డుకోవడంతోపాటు ఉన్నవాటిని కూడా ఇక్కడి నుంచి వెళ్లిపోయేలా చేసిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నారని మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, ఏపీఐఐసీ జెడ్ఎం సుహానాసోనీ, తహసీల్దార్ శ్రీధర్, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

ఇంటికొక పారిశ్రామికవేత్త తయారుకావాలి

- ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి



ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు

పుట్టపర్తిరూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఇంటికొక పారిశ్రామిక వేత్త తయారుకావాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. జిల్లాకేంద్రం పరిధి కప్పలబండ సమీపాన ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కును కలెక్టర్ టీఎస్ చేతన్, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 104 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో రూ.154 కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా పారిశ్రామికవాడను తీర్చిదిద్దుతామన్నారు. మాజీ మంత్రి పల్లె మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముందుచూపుతో కప్పలబండలో 104 ఎకరాలను సేకరించి, పారిశ్రామికవాడ ఏర్పాటు చేసి, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని నిర్ణయించారన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ నాశనం చేసిందన్నారు.

ప్రస్తుతం కూటమి అధికారంలోకి రావడంతో ఈ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నపెద్దన్న, ఆర్డీఓ సువర్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, ఎంపీపీ రమణారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాక పుట్టిస్తున్న కొత్త రూల్స్..!

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు శ్రీకారం

- జీవోలు 19, 20, 21 విడుదల చేసిన విద్యాశాఖ
- 96 యూపీ స్కూళ్లు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్
- 554 ఎస్ఏ పోస్టులు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్
- ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 క్రియేషన్ పోస్టులు
- ఉపాధ్యాయ సంఘాల నేతల నుంచి విమర్శలు
- డీఈఓకు నేతల నుంచి వినతుల వెల్లువ





డీఈఓకు ప్రైమరీ స్కూల్ హెచ్ఎం యూనియన్ నేతల వినతి, స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని పీఆర్టీయూ నేతల వినతి

అనంతపురం విద్య, మే 13(ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజన ఉత్తర్వులు ఉపాధ్యాయులు, సంఘాల నేతల్లో కాక పుట్టిస్తున్నాయి. ప్రభుత్వం మంగళవారం జారీ చేసిన జీవోలు 19, 20, 21, ఉపాధ్యాయులకు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మెజార్టీ ఉపాధ్యాయులు, సంఘాల నేతల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 554 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. కొత్తగా జిల్లాకు 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. అదే విధంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ జీవోలు జారీ చేశారు.

96 స్కూళ్లు అప్‌గ్రేడ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 96 అప్పర్ ప్రైమరీ స్కూళ్లను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. హిందూపురం మండలంలో 10, రాయదుర్గంలో 9, అనంతపురం మండలంలో 8 పాఠశాలలు, తాడిపత్రిలో 6, విడపనకల్లు, కదిరిలో 5 చొప్పున, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, ఉరవకొండ మండలంలో 4 చొప్పున, కణేకల్లు, మడకశిర, బుక్కపట్నం మండలాలలో 3 చొప్పున, బెళుగుప్ప, బొమ్మనహాళ్, బుక్కరాయసముద్రం, కళ్యాణదుర్గం, కూడేరు, లేపాక్షి, పెనుకొండ, గుత్తి మండలాలలో రెండు చొప్పున, ఆత్మకూరు, చిలమత్తూరు, ధర్మవరం, గాండ్లపెంట, గోరంట్ల, గుంతకల్లు, ఓడీసీ, పామిడి, రొద్దం, శెట్టూరు, వజ్రకరూరులో ఒక్కొక్క పాఠశాలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల కన్వర్షన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వందలాది స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ హెచ్ఎంలుగా/స్కూల్ అసిస్టెంట్స్‌గా కన్వర్షన్ చేశారు. మొత్తంగా 554 పోస్టులను కన్వర్షన్ చేశారు. ఇందులో ఎస్ఏ పోస్టులు 520 కాగా, మరో 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టులు ఉన్నాయి. స్కూల్ అస్టింట్ పోస్టులు 520లో జడ్పీ, మండల పరిషత్‌లో 515, ప్రభుత్వ పాఠశాలల్లో 5 పోస్టులను కన్వర్షన్ చేశారు. 34 స్కూల్ అసిస్టెంట్ తత్సమానమైన పోస్టుల్లో జడ్పీ, ఎంపీపీ స్కూళ్ల నుంచి 31 పోస్టులు, గవర్నమెంట్ నుంచి 3 పోస్టులను కన్వషన్ చేశారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ లేదా స్కూల్ అసిస్టెంట్లుగా కన్వర్షన్ ఇవ్వడంపై మెజార్టీ టీచర్లు, సంఘాల నేతల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూపీ స్కూళ్లలోని సబ్జెక్టు టీచర్లను తీసుకెళ్లి ప్రైమరీలో బోధన చేయించడం ఏమిటని మండిపడుతున్నారు.

కొత్తగా 437 పోస్టుల సర్దుబాటు

ఉమ్మడి జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేయనున్నారు. క్రియేషన్ కమ్ డైరెక్టర్ (హెచ్ఓడీ) పూల్ నుంచి జిల్లాకు 437 పోస్టులను ఇవ్వనున్నారు. ఇందులో 78 హెచ్ఎం పోస్టులు ఉన్నాయి. అందులో ఎంపీపీ స్కూళ్లలో 54, మున్సిపల్ కార్పొరేషన్ స్కూళ్లలో 5, మున్సిపాలిటీల్లో 19 పోస్టులు ఇవ్వనున్నారు. స్కూల్ అసిస్టెంట్లు 359 పోస్టులు సర్దుబాటు చేయనుండగా, అందులో ఎంపీపీ స్కూళ్లలో 93, గవర్నమెంట్‌లో 6, మున్సిపాల్ కార్పొరేషన్‌లో47 పోస్టులు, మున్సిపాలిటీల్లో 213 పోస్టులు సర్దుబాటు చేయనున్నారు. విద్యాశాఖాధికారుల సమాచారం మేరకు డైరెక్టర్ పూల్ ద్వారా ఇతర జిల్లాల నుంచి మన జిల్లాకు కొత్తగా 437 పోస్టులను సర్దుబాటు చేస్తారని స్పష్టమవుతోంది.

కొత్త రూల్స్‌పై విమర్శలు

కొత్త ఉత్తర్వులపై ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్ల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు సంఘాల నేతలు డీఈఓను వేర్వేరుగా కలసి అభ్యంతరం తెలిపారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు డీఈఓను కలిశారు. ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శులు రమణ, మర్రిస్వామి, జిల్లా అధ్యక్షులు నారాయణస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి రమణ ప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం పనిచేస్తున్న పీఎస్ హెచ్ఎంలకు బదిలీల్లో స్థానాలు కేటాయించిన తర్వాతనే స్కూల్ అసిస్టెంట్స్‌కు పీఎస్ హెచ్ఎంలుగా కన్వర్షన్ ఇవ్వాలని అన్నారు. గత బదిలీల్లో రేషనలైజేషన్ కారణంగా 8 ఏళ్లలోపే బదిలీ అయ్యి, త్వరలో జరిగే బదిలీల్లో రేషనలైజేషన్‌కు గురయ్యే ప్రైమరీ హెచ్ఎంలకు పాత స్టేషన్ పాయింటు కేటాయించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు. పీఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డీఈఓను కలసి , బదిలీల్లో అసంబద్ధ అంశాలను పరిష్కరించాలని కోరారు. సీనియారిటీ జాబితాలు, దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల వివరాలు, గతంలో ప్రిఫరెన్షియల్ కేటగిరీ ఉపయోగించుకున్న వారి వివరాలను, సర్దుబాటు ప్రక్రియలో ఎఫెక్ట్ అయిన టీచర్ల వివరాలు, కొత్తగా అప్‌గ్రేడ్ అయ్యే స్కూళ్లు, పోస్టుల వివరాలు ప్రకటించాలని కోరారు. ఈ మేరకు డీఈఓకు వినతిపత్రం అందించారు.

దంచికొట్టిన వాన

పొంగిన వాగులు, వంకలు
పలుచోట్ల పంట నష్టం



ఉధృతంగా పారుతున్న చెన్నేకొత్తపల్లి మండలం పెద్దమొగలాయపల్లి వంక

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి తర్వాత వాన దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చెక్‌డ్యాంలు నిండిపోయాయి. పలు చెరువుల్లోకి నీరు చేరింది. విపరీతమైన ఎండ, ఉక్కపోతతో విలవిల్లాడుతున్న జనం.. వర్షం రాకతో ఉపశమనం పొందారు. భూగర్భ జల మట్టం పెరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కొత్తచెరువు మండలంలోని వేములేటిపల్లి వద్దనున్న చెక్ డ్యాం పొంగిపొర్లింది. చెన్నేకొత్తపల్లి మండలంలోని పెద్దమొగలాయపల్లి, ప్యాదిండితోపాటు పలు చిన్నచిన్న వంకలు కూడా ప్రవహించాయి. నాగసముద్రం, మేడాపురం తదితర చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. రామగిరి చెరువులోకి నీరు చేరింది.

పిడుగు పడి పేలిన ఇన్వర్టర్

విడపనకల్లు మండలంలోని ఆర్ కొట్టాల గ్రామంలోని రామాలయం లోగల ఓ గది పక్కనే ఉన్నవేప చెట్టుపై పిడుగు పడింది. చెట్టుకు ఆనుకుని ఉన్న గదిలోని ఇన్వర్టర్ పేలి పోయింది. ఇంట్లోని స్విచ్ బోర్డులు పేలిపోయాయి. టీవీ, ఫ్రిజ్ కాలిపోయాయి. విద్యుత్ సరఫరా ఆగి పోయింది.

ఏడెకరాల్లో బొప్పాయి పంటనష్టం

ఈదురుగాలులతో కూడిన వర్షానికి గుమ్మఘట్ట మండలం గలగల గ్రామ రైతులు సోమలింగ, రమేష్‌కు చెందిన ఏడెకరాల్లో బొప్పాయి పంట దెబ్బ తింది. దీంతో రూ.10 లక్షల దాకా నష్టం వాటిలినట్లు ఉద్యాన శాఖ అధికారులు అంచనా వేశారు.

వర్షపాతం నమోదు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. కొత్తచెరువు 77.6, చెన్నేకొత్తపల్లి 74.6, రాప్తాడు 66.4, గుత్తి 61.4, బుక్కపట్నం 59.4, యాడికి 50.0, కంబదూరు 40.4, పుట్టపర్తి 36.2, ధర్మవరం 34.6, నల్లమాడ 24.0, రామగిరి 23.6, శెట్టూరు 22.6, కుందుర్పి 20.6, కదిరి, కనగానపల్లి 15.2, పరిగి 11.6, బుక్కరాయసముద్రం 11.2, అగళి 10.2, విడపనకల్లు 8.8, తలుపుల, రొళ్ల 7.4, ముదిగుబ్బ 6.8, ఓబుళదేవరచెరువు 6.4, నార్పల 6.2, గుమ్మఘట్ట 4.8, గుంతకల్లు, బ్రహ్మసముద్రం, కూడేరు 4.2, బొమ్మనహాళ్ 3.4, పెనుకొండ 2.6, అనంతపురం, బత్తలపల్లి, తాడిమర్రిలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.



కొత్తచెరువు మండలం వేములేటిపల్లి వద్ద పొంగిపొర్లుతున్న చెక్ డ్యాం



గుమ్మఘట్ట మండలం గలగల గ్రామంలో దెబ్బతిన్న బొప్పాయి పంటను చూపుతున్న రైతు సోమలింగ



పేలిన ఇన్వర్టర్

భర్తను ముంచేసి
ఉడాయించిన భార్య

రూ.80 లక్షలకుపైగా మోసం చేసిందంటూ ఫిర్యాదు



బాధితుడు ఇబ్రహీం ఫయాజ్ బాషా

బెళుగుప్ప, మే13(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడైన భర్తను మోసగించి లక్షలాది రూపాయలతో ఉడాయించింది ఓ భార్య. దీనిపై బాధితుడు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఇబ్రహీం ఫయాజ్ బాషా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫయాజ్ బాషా పోలియో బారిన పడి దివ్యాంగుడయ్యారు. చేతులు పని చేయడం లేదు. ఆయనకు గుంటూరు జిల్లా తెనాలి వాసి షేక్ షబీనాతో వివాహమైంది. ఆమె జల్సాలకు డబ్బులివ్వాలని భర్తను బెదిరిస్తుండేది. దివ్యాంగుడంటూ వేధిస్తుండేది. ఈ నేపథ్యంలోనే ఫయాజ్ బాషా పేరున బ్యాంకులో రూ.30 లక్షలు రుణం తీసుకుని, షబీనా అక్క జరీనాకు ఇప్పించారు. దౌర్జన్యంగా ఇంటి స్థలాన్ని రూ.41 లక్షలకు అమ్ముకున్నారు. ఐదు తులాల బంగారంతోపాటు రూ.6 లక్షల కారుతో గతనెల 29న పరారయ్యారని బాధితుడు వాపోయారు. దివ్యాంగుడినైన తనను వేధించి, మోసం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివ తెలిపారు.

అప్పుల ఉరికి వేలాడిన మరో నేతన్న



చంద్రశేఖర్ (ఫైల్)

కొత్తచెరువు, మే 13(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మరో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక బాలాజీ నగర్‌కు చెందిన చేనేత కార్మికుడు చంద్రశేఖర్ (53) మంగళవారం ఉరేసుకుని, మరణించాడు. టూటౌన్ సీఐ రెడ్డప్ప, చేనేత బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చంద్రశేఖర్ కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మగ్గం గిట్టుబాటు కాక, కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ముడిసరుకుల కోసం రూ.5లక్షలు అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలంటూ కుటుంబసభ్యులతో తరచూ అంటుండేవాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది సోమవారం రాత్రి కుటుంబసభ్యులు ఇంటి బయట నిద్రిస్తుండగా.. చంద్రశేఖర్ ఇంట్లో ఉరేసుకుని మరణించాడు. ఉదయం లేచి తలుపులు తీసిన కుటుంబ సభ్యులకు.. చంద్రశేఖర్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. నేతన్న భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నేతన్నకు కుమారుడు కేదార్, కుమార్తె శాంబవి ఉన్నారు.

సిబ్బందిని వేధించడం తగదు

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలి

ఎన్ఎంయూఏ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎన్వీ రమణ



ఎన్ఎంయూఏ నాయకులు, ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

అనంతపురం కల్చరల్, మే 13(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న కారణాలకే ఏపీఎస్ఆర్టీసీ సిబ్బందిపై అధికారులు వేధింపులకు పాల్పడడం తగదని ఎన్ఎంయూఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్వీ రమణ పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం రీజియన్‌లోని 7 డిపోల నుంచి ఎన్ఎంయూఏ నాయకులు, సిబ్బంది 'చలో ఆర్ఎం కార్యాలయం' చేపట్టారు. ఆర్ఎం కార్యాలయం ముందు కార్యక్రమంలో ఎన్వీ రమణ మాట్లాడారు. చిన్నచిన్న కారణాలను చూపుతూ సిబ్బంది ప్రమోషన్లు ఆపడం, వేధించడాన్ని ఉన్నతాధికారులు మానుకోవాలన్నారు. ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో ఖాళీగా ఉన్న 12వేల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూఏ జిల్లా చైర్మన్ సూరిబాబు, కార్యదర్శి ప్రతాప్ నారాయణ, ఉపాధ్యక్షుడు సదాశివరెడ్డి, నేతలు డీఎన్ రెడ్డి, పుల్లయ్య, శశికళ, రీజియన్‌లోని వివిధ డిపోల అధ్యక్షకార్యదర్శులు పాల్గొన్నారు.

స్పెషల్‌బ్రాంచ్ ఎస్ఐ సరెండర్

పుట్టపర్తి రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ ఎం. ప్రదీప్‌కుమార్‌ను సరెండర్ చేశారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షీమూషి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూల్ రేంజ్ డీఐజీ ముందు రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అంత్యక్రియలు

బళ్లారి, మే 13(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య అంత్యక్రియలు బుధవారం బళ్లారిలోని హరిశ్చంద్ర ఘాట్‌లో నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం గుండెపోటుతో ఆయన కన్నుమూసిన సంగతి తెలిసిందే. మంగళవారం పుల్లయ్య భౌతిక కాయాన్ని బళ్లారిలోని ఆయన స్వగృహంలో అభిమానుల సందర్శనార్థం ఉంచారు. అనంతపురం, కర్నూలు, బళ్లారి, హైదరాబాద్ నుంచి వచ్చిన పలువురు నేతలు, అభిమానులు ఆయనకు నివాళి అర్పించారు.

ఊరుగాని ఊరిలో ఉరి

- పుట్టింట ఒక్కరోజూ గడపనివ్వని భర్త
- ఇద్దరు కొడుకులు పుట్టినా.. పురిటికీ వెళ్లలేక నరకం
- తమ్ముడి నిశ్చితార్థానికి వెళ్లినా మనశ్శాంతి కరువు
- అత్తారింటికి వచ్చి.. తాళి, మెట్టెలు తీసేసి అనంతకు..
- అర్ధరాత్రి రైల్వే క్వార్టర్స్ వద్ద ఉరి వేసుకున్న అభాగ్యురాలు
- కర్నూలు జిల్లా నందవరం కోడలు జీవితం విషాదాంతం



ఉరి వేసుకున్న ఉరుకుందమ్మ, ఇన్‌సెట్‌లో ఉరుకుందమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళితే కనీసం రెండు రోజులు ఉండనివ్వడు. 'నువ్వు అక్కడుంటే నాకు అన్నం వండిపెట్టేది ఎవరు..?' అని వేధిస్తాడు. దీంతో అలా వెళ్లడం, ఇలా రావడం.. పెళ్లైనప్పటి నుంచి ఐదేళ్లుగా ఇదే జరిగింది. ఆమెకు ఇద్దరు పిల్లలు పుట్టినా.. ప్రసవానికి కూడా పుట్టింటికి వెళ్లింది లేదు. బాలింతగా ఓ వారం రోజులు కూడా రక్త సంబంధీకులతో గడిపింది లేదు. తాజాగా తమ్ముడి నిశ్చితార్థానికి వెళ్లి నాలుగు రోజులు ఉందామని అనుకుంది. మామ కూడా అల్లుడితో ఇదే విషయం చెప్పి తీసుకెళ్లాడు. కానీ అల్లుడు మారలేదు. భార్య పుట్టింటికి వెళ్లిందో లేదో.. మరుసటి రోజే ఫోన్ చేసి తిరిగి రమ్మన్నాడు. ఎవరు ఎంత బతిమాలినా వినుకోలేదు. దీంతో కూతురును తండ్రి మెట్టినింట దించివెళ్లాడు. ఇలాంటి జీవితం తనకెందుకు అని అనుకుంది ఆమె..! తాళి, మెట్టెలు, చెవి దిద్దులు ఇంట్లోనే వదిలేసి బయటకు వెళ్లిపోయింది. ఊరుగాని ఊరికి వచ్చి ఉరి వేసుకుంది. అనంతపురం నగరంలోని రైల్వే కార్టర్స్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి బలవన్మరణానికి పాల్పడింది.

గుర్తు తెలియని మహిళ..

అనంతపురం నగరంలోని మొదటి రోడ్డు రైల్వే క్వార్టర్స్ పక్కనే ఉన్న స్థలంలో ఓ మహిళ చెట్టుకు చీరతో ఉరి వేసుకుంది. స్థానికులు మంగళవారం ఉదయం గమనించి, అక్కడ గుమిగూడారు. ఎవరూ ఆమెను గుర్తు పట్టలేకపోయారు. ఉదయం 7.30 గంటల సమయంలో అనంతపురం త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శరత్‌చంద్ర సిబ్బందితో అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఆమె అరచేతిలో ఓ ఫోన్ నంబర్ కనిపించడంతో.. కాల్ చేశారు. ఆ మహిళ పేరు ఉరుకుందమ్మ(24) అని, ఆ నంబర్ ఆమె భర్త పంపయ్యదని తేలింది. కర్నూలు జిల్లా నందవరం మండల కేంద్రానికి చెందిన ఆమె.. అనంతపురం నగరానికి రైలులో వచ్చి, ఆత్మహత్య చేసుకున్నట్లుగా గుర్తించారు. మంత్రాలయం మండలం మాధవరం గ్రామానికి చెందిన ఆమె తండ్రి ఈరన్నకు సమాచారం అందించారు.

పుట్టింటికి దూరమై...

మాధవరం గ్రామానికి చెందిన ఈరన్న భార్య కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. ఆయనకు కూతురు ఉరుకుందమ్మ, కుమారుడు నాగరాజు సంతానం. ఐదేళ్ల క్రితం నందవరం మండల కేంద్రానికి చెందిన పంపయ్యతో ఉరుకుందమ్మకు వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు ఈరన్న(రెండున్నరేళ్లు), తరుణ్ కుమార్ (3నెలలు) ఉన్నారు. పెళ్లయినప్పటి నుంచి ఉరకుందమ్మకు పుట్టింట్లో కొన్ని రోజులైనా గడిపే అవకాశం రాలేదు. ఒకటి రెండు రోజులకే తిరిగి రావాలని భర్త పంపయ్య పోరు పెట్టేవాడు. ఏమైనా అంటే తనకు అన్నం పెట్టేదెవరని గద్దించేవాడు. పంపయ్యకు తనమీద ఉన్నది ప్రేమో, అనుమానమో ఆమెకు అర్థమయ్యేది కాదని కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు. ఆమెకు సెల్‌ఫోన్ కూడా లేదని తెలిపారు. ఇదివరకు గొడవలు జరిగితే మూడుసార్లు పంచాయితీ చేసి తమ కూతురును కాపురానికి పంపామని మృతురాలి తండ్రి, బాబాయి ఆవేదన వ్యక్తం చేశారు.

తమ్ముడి నిశ్చితార్థంలోనూ....

ఉరుకుందమ్మ సోదరుడు నాగరాజుకు వివాహం కుదిరింది. దీంతో బట్టలు పెడతామంటే పది రోజుల క్రితం పుట్టింటికెళ్లింది. రెండు రోజులు ఉండి వచ్చేసింది. ఈ నెల 8న రెండో కుమారుడికి నామకరణం చేశారు. ఈ నెల 10వ తేదీ తమ్ముడు నాగరాజు నిశ్చితార్థం ఉండటంతో 9వ తేదీ పంపయ్య ఆమెను పుట్టింటికి పంపాడు. బావమరిది నిశ్చితార్థం ఉన్నా తాను మాత్రం వెళ్లలేదు. పైగా భార్య పుట్టింటికి వెళ్లిన మరుసటి రోజే మామ ఈరన్నకు ఫోన్ చేశాడు. తన భార్యను పంపించమని అడిగాడు. నాలుగు రోజులు ఉండి, బుధవారం వస్తుందిలే అని చెప్పినా వినుకోలేదు. కుదరదని, తనకు అన్నం పెట్టేవారెవరూ లేరని అన్నాడు. గత్యంతరం లేక ఈరన్న ఆదివారం ఉరుకుందమ్మను వెంటబెట్టుకుని అల్లుడి ఇంట్లో దింపి వెళ్లాడు.

పిల్లలను.. తాళిని అక్కడే ఉంచి...

ఈ నెల 12వ తేదీ ఉదయ 6గంటలకు పంపయ్య తండ్రి నరసింహులు పనికి వెళ్లాడు. 9 గంటల సమయంలో పంపయ్య సిమెంట్ గోడౌన్‌కు పనికోసం వెళ్లాడు. ఆ సమయంలో అత్త మల్లమ్మ, ఉరకుందమ్మ, పిల్లలు మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఏం జరిగిందోగాని, 10 గంటల సమయంలో ఉరుకుందమ్మ తాళి, కాలిమెట్టలు, చెవిపోగులు మంచంపై వేసి, అత్తకు కూడా చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. ఆదోని లేదా మంత్రాలయం వెళ్లి అక్కడి నుంచి రైలులో అనంతపురం చేరుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. సోమవారం రాత్రి పొద్దుపోయాక మొదటి రోడ్డు రైల్వే క్వార్టర్స్ పక్కనున్న స్థలంలో ఓ చెట్టుకు చీరతో ఆమె ఉరి వేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రామగిరిలో వైసీపీకి షాక్

- ముగ్గురు ఎంపీటీసీలు.. టీడీపీలోకి చేరిక..
- మరికొంతమంది చేరే అవకాశం..
- ఎంపీపీ పీఠం సైకిల్ వశమయ్యేనా?



పరిటాల సునీత, శ్రీరామ్ సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ ఎంపీటీసీలు

రామగిరి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో భారీ ట్విస్ట్. ఇటీవల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా తమ ఎంపీటీసీలను వైసీపీ నేతలు.. క్యాంపునకు తరలించి, గైర్హాజరయ్యేలా చేశారు. దీంతో కోరంలేక ఎన్నిక వాయిదా వేశారు. త్వరలో మళ్లీ ఎన్నిక నిర్వహించే చర్యలు చేపడుగున్న తరుణంలో వైసీపీకి అనుకోని షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు టీడీపీలోకి చేరిపోయారు. పేరూరు-1, 2 ఎంపీటీసీలు కర్రెన్న, భారతి, మాదాపురం ఎంపీటీసీ సంపత్ తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని వెంకటాపురంలో మంగళవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ సమక్షంలో వారు పసుపు కండువా కప్పుకున్నారు. దీంతో టీడీపీ బలం నాలుగుకు పెరిగింది. ఇంకొంత మంది వైసీపీ సభ్యులు టీడీపీలో చేరే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈలెక్కన ఎంపీపీ పీఠం టీడీపీ వశమయ్యే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి.

ఎంపీపీ నాగమ్మ మృతితో ఎన్నిక అనివార్యమైంది. మండలంలో మొత్తం 10 ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఎంపీపీ మృతితో 9 మంది ఎంపీటీసీలు ఉంటారు. వారిలో ఒకరు టీడీపీ తరఫున గెలిచారు. 8 మంది వైసీపీ ఎంపీటీసీలు ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడింది. ఎన్నిక రోజున సభ్యులు గైర్హాజరవడంతో వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ ఎన్నికకు మరోసారి నోటిఫికేషన్ వెలువడనుంది. ఈనెల 19న ఎన్నిక జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన ముగ్గురు ఎంపీటీసీలు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం నాలుగుకు చేరింది. వైసీపీ సభ్యులు ఐదుగురు ఉంటారు. వీరిలో ఇంకొందరు టీడీపీలో చేరుతారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. అదే జరిగితే.. ఎంపీపీ పీఠం టీడీపీ వశమవుతుంది. గత ఎన్నికల్లో సభ్యులను శిబిరాలకు తరలించి, వాయిదా పడేలా చేసిన వైసీపీ నాయకులు ప్రస్తుత పరిణామాలతో దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వైసీపీ తీరుతో విసిగిపోయే టీడీపీలోకి చేరుతున్నట్లు పార్టీ మారుతున్న ఎంపీటీసీలు ప్రకటించారు. ఇటీవల ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి.. తమను క్యాంపునకు తరలించి, నిర్బంధించారని వారు స్పష్టం చేశారు. టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నామన్నారు. అందుకే పార్టీలోకి చేరుతున్నామన్నారు.

15న ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్

రామగిరి ఎంపీపీ ఎన్నికకు ఈనెల 15న నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కమలాబాయి మంగళవారం తెలిపారు. 19న ఎన్నిక ఉంటుందన్నారు. ఆ మేరకు సభ్యులకు నోటీసులు పంపనున్నట్లు ఆమె తెలిపారు.

ఆర్టీసీ బస్సులో గొలుసు చోరీ





ప్రయాణికులను తనిఖీ చేస్తున్న పోలీసులు, బాధితురాలు రత్నమ్మ

బుక్కరాయసముద్రం, మే 13(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణికురాలు రత్నమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు మంగళవారం చోరీ చేశారు. దీంతో బస్సును ఆపి, పోలీసులు తనిఖీలు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం నగరంలోని బళ్లారి బైపాస్ సమీపాన నివాసం ఉంటున్న రత్నమ్మ, ఆమె కోడలు సురేఖ తాడిమర్రి మండలం కునుకుంట్ల గ్రామానికి మంగళవారం మధ్యాహ్నం బయల్దేరారు. అనంతపురం బస్టాండులో పార్నపల్లికి వెళ్లే బస్సు ఎక్కారు. బస్సు ఎక్కిన ఐదు నిమిషాలకే రత్నమ్మ మెడలోని ఐదున్నర తులం బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించారు. బస్సు కదిలాక గుర్తించిన బాధితురాలు.. బస్సు డ్రైవర్ కుళ్లాయప్ప, కండక్టర్ రమాకాంత్‌కు తెలిపింది. బస్సును నేరుగా బుక్కరాయసముద్రం పోలీసుస్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. విషయం పోలీసులకు తెలిపారు. పోలీసులు.. బస్సులోని ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి వద్ద బంగారు గొలుసు లభించలేదు. బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమె బస్సు ఎక్కిన తర్వాత అనంతపురంలోని బస్టాండు వద్ద గుర్తుతెలియని ఐదుగురు మహిళలు అదే బస్సు ఎక్కి దిగి వెళ్లిపోయారని పోలీసులకు తెలిపారు. అనంతపురం త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసును త్రీటౌన్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని ఐదుగురు మహిళల కోసం బస్టాండు వద్దనున్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ బస్సులో బంగారు నగల చోరీ

గుత్తి, మే 13(ఆంధ్రజ్యోతి): తన బ్యాగ్‌లో ఉన్న బంగారు నగలు చోరీ అయ్యాయని ప్రయాణికురాలు సుభాన్‌బీ స్థానిక పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కర్నూలుకు చెందిన సుభాన్‌బీ గుంతకల్లులో తన బంధువుల రిసెప్షన్‌కు కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి గుంతకల్లు నుంచి గుత్తికి వచ్చేందుకు బస్సు ఎక్కారు. గుత్తిలో బస్సు దిగిన తరువాత తన బ్యాగ్‌లో ఉన్న ఆరు తులాల రెండు బంగారు నెక్లెస్‌లు చోరీ అయినట్లు గుర్తించి, వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీనీ టన్ను రూ. 28వేలు

అనంతపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 5,350, సరాసరి రూ. 15వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 692 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నారా లోకేశ్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన



బేతాపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



శాప్ చైర్మన్‌తో మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి/రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 15న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటన నేపథ్యంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. అనంతపురం రోడ్డులోని మాచినేని పాఠశాల ఎదురుగా ఏర్పాటు చేస్తున్న సభ ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. శాప్ చైర్మన్ రవినాయుడుతో పర్యటన ఏర్పాట్ల గురించి వారు చర్చించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, నాయకులు ప్రతాప్, చికెన్ శ్రీనివాసులు, రమేష్, యంగన్నపల్లి సర్పంచు భరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి: ఎమ్మెల్యే

రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఈ నెల 15, 16న గుత్తి, బేతాపల్లిలో పర్యటించనున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపు నిచ్చారు. మండలంలోని బేతాపల్లి గ్రామశివారులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. రేన్యూ పవర్ సోలార్ ప్రైవేట్ కంపెనీకి సంబంధించి మంత్రి భూమి పూజ కార్యక్రమ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత గుత్తిలో కార్యకర్తల సమావేశం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్, సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, టీడీపీ పట్టణ, మండల కన్వీనర్లు బర్దీవలి, ఎంకే చౌదరి, టీడీపీ నాయకులు తెలుగు యువత అధికార ప్రతినిధి ప్రతాప్, ఆసుపత్రి కమిటీ సభ్యుడు, చికెన్ శీనా, నాయకులు రమేష్, గోవర్ధన్ గౌడ్, బండారు ఆనంద్, తలారి మస్తానప్ప, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్, తహసీల్దార్ ఓబులేసు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ 'అంబికా' సోదరి వేదవతి అంత్యక్రియలు

గుంతకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): హెలీక్యాప్టర్ ప్రమాదంలో మరణించిన వేదవతి కుమారి (48) అంత్యక్రియలు బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సోదరి వేదవతి కుమారి, ఆమె భర్త ముష్టూరు భాస్కర్ గంగోత్రి యాత్రకు ఈ నెల 8న బయలుదేరి వెళ్లి హెలీక్యాప్టర్ ప్రమాదానికి గురైన సంగతి విదితమే. ఈ ప్రమాదంలో వేదవతి కుమారి అక్కడికక్కడే మరణించగా, భాస్కర్ తీవ్రగాయాలతో బయటపడ్డారు. భాస్కర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బుధవారం వేదవతి కుమారి మృతదేహాన్ని గుంతకల్లుకు తెచ్చి మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబికులు తెలియజేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ భాస్కర్ స్వగృహంలో బంధువుల సందర్శన ఉంటుందని, మధ్యాహ్నం 1 గంటలకు తమ ఫాంహౌస్‌లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ధర్మవరం యార్డు పనులను పరిశీలించిన డీఆర్ఎం

గుంతకల్లు, మే 13(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని ధర్మవరం రైల్వే స్టేషన్ యార్డులో జరుగుతున్న నాన్ ఇంటర్లాకింగ్ పనులను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా మంగళవారం పరిశీలించారు. గుంతకల్లు నుంచి వివిధ శాఖాధికారులతో బయలుదేరి ధర్మవరం వెళ్లిన డీఆర్ఎం నాన్ ఇటర్లాకింగ్ పనులలో భాగంగా లింకింగ్‌లను, సిగ్నలింగ్ అండ్ టెలీ కమ్యూనికేషన్ వ్యవస్థలను తనిఖీచేశారు. అంచనాలను అనుసరించి పనులు సకాలంలో పూర్తికావాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఈ, సీఎస్‌డీఈ, రైట్స్ శాఖాధికారులు పాల్గొన్నారు.



యార్డు పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

న్యూస్ బాక్స్

కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌కు శుభాకాంక్షలు



శుభాకాంక్షలు తెలుపుతున్న గౌస్‌మొద్దీన్, గాజుల ఆదెన్న

అనంతపురం అర్బన్ మే 13(ఆంధ్రజ్యోతి): ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమితులైన వెంకటశివుడు యాదవ్‌కు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, నాయకులు రామకృష్ణ, లక్ష్మీనారాయణ, బాబు మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బెస్త నారాయణస్వామి, నాయకులు రమేష్ బాబు, శివశేఖర్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, నాయకులు బొమ్మినేని శివ, అమర్ యాదవ్, సిరిసాల రాంబాబు తదితరులు వెంకట శివుడు యాదవ్‌ను సన్మానించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ సాంస్కృతిక విభాగం నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న సుధాకర్ యాదవ్ తదితరులు

యువతి ఆత్మహత్య కేసులో.. యువకుడు, అతడి తల్లి అరెస్ట్

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునే ముందు ఓ యువతి రాసిన లేఖలోని రాత ఆమెదేనని అనంతపురం రూరల్ పోలీసులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణమైన యువకుడిని, అతడి తల్లిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. నగరంలోని భాగ్యనగర్‌కు చెందిన భువనేశ్వరి గతంలో వలంటీర్‌గా పనిచేసింది. అనంతరం ఓ ప్రైవేట్ హాస్టల్‌లో వార్డెన్‌గా పనిచేసేది. ఆమె గతంలో హర్షవర్దన్ అనే యువకుడితో సన్నిహితంగా మెలిగింది. ఏం జరిగిందో తెలియదు కానీ ఈ ఏడాది ఫిబ్రవరి 16న తన గదిలో ఉరి వేసుకుని మృతి చెందింది. ఆ సమయంలో ఆమె తన చావుకు కారణం హర్షవర్దన్, అతడి కుటుంబం అని రాసిన లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. అందులోని రాత ఆమెదేనని తేలింది. విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం హర్షవర్దన్, ఆమె తల్లి పద్మావతిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళ ఆత్మహత్య

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): ఆస్తమాతో బాధపడుతున్న ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్ల కాలనీలో రాజశేఖర్, వడ్డే నందిని(19) దంపతులు నివాసముంటున్నారు. వారికి ఆరు నెలల క్రితం పెళ్లయింది. నందిని ఏడాది నుంచి ఆస్తమాతో బాధపడుతోంది. ఎక్కడ చూపించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. సోమవారం విషద్రావకం తాగింది. కుటుంబసభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

అనంతపురం క్రైం, మే 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వాసుపత్రి ఎదుట మంగళవారం ఆటో, బైక్ ఢీ కొన్నాయి. బైక్‌పై వెళ్తున్న షామీర్‌బాషాకు గాయాలయ్యాయి. అదేవిధంగా టీవీటవర్ సమీపంలో లారీ రివర్స్ తీస్తున్న సమయంలో బైక్ ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న రవికుమార్ తలకు గాయాలయ్యాయి. ఈ రెండు ఘటనలపైనా ట్రాఫిక్ పోలీసులు ఆరాతీస్తున్నారు.

ఉద్యోగాలకు 66 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో కళాశాల యాజమాన్యం

అనంతపురం రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ కంపెనీ వర్చ్యూసాలో ఉద్యోగాలకు 66మంది ఎంపికైనట్లు పీవీకేకే ఐటీ ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు తెలిపారు. ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఐటీలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ఆధ్వర్యంలో ప్రముఖ ఐటీ కంపెనీలోని కేపీఓ అనలిస్ట్ ఉద్యోగాలకు ప్రాంగణ నియామకాలు నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 400మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు. వారిలో 66మంది ఉద్యోగాలకు అర్హత సాధించగా, 29మంది కళాశాలకు చెందిన వారు ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఎంపికైన వారిని కళశాల చైర్మన్ పల్లె కిశోర్ అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ డీన్ డాక్టర్ భానుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వానొస్తే.. విద్యుత్ అంతే..!



కరెంటు లేకపోవడంతో శింగనమల సచివాలయంలో ఖాళీగా కూర్చున్న ఉద్యోగి



పనుల మీద వచ్చి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వేచి ఉన్న జనం

- దాదాపు ఎనిమిది గంటలపాటు ఉండని సరఫరా
- ఫోన్ చేసినా స్పందించే నాథుడు కరువు
- నెలరోజులుగా ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలు

శింగనమల, మే 13(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి... ఉక్కపోత... దీనికి తోడు చిన్న పాటి ఈదురు గాలులు, చినుకులకే విద్యుత్ అంతరాయం తప్పదు. అది రాత్రయినా, పగలైనా దాదాపు ఎనిమిది గంటలకు పైగా విద్యుత్ సరఫరా ఉండదు. ఇది శింగనమల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు నెల రోజులుగా తరచూ ఎదురవుతున్న అనుభవం. దీంతో రాత్రి సమయంలో గ్రామాల్లో అంధకారం అలుముకుంటుంది. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పగలైతే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురివుతున్నారు. మండల కేంద్రమైన శింగనమలతో పాటు పెరవలి, సలకంచెరువు, ఆకులేడు, తరిమెల గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. వాటికి బుక్కరాయసముద్రం సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే చిన్న పాటి ఈదులు గాలులు, చిన్న పాటి వర్షం వచ్చినా విద్యుతో శాఖ అధికారులు కరెంట్ సరాఫర కట్ చేయడం ఖాయం. తరువాత దాదాపు ఏడు నుంచి ఎనిమిది గంటల వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించరు. గత నెల నుంచి మండలంలో ఇదే తీరు సాగుతోంది. శింగనమలలో పనిచేస్తున్న ఏఈ ఇటీవలే సెస్పెండయ్యారు. కొత్త వారిని నియమించలేదు. సంబంధిత సబ్‌స్టేషన్‌కు, అధికారులకు ఫోన్ చేసినా స్పందించే నాథుడే లేడని విద్యుత్ వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రాత్రి 2కి పోయి మధ్యాహ్నం 12కి వచ్చింది



విద్యుత్ సరఫరాలో అంతరాయం అంటే భయంగా ఉంది. మంగళవారం రాత్రి రెండు గంటలకు చిన్నపాటి గాలి, వర్షం మొదలైంది. దీంతో కరెంట్ కట్ అయింది. తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు వచ్చింది. కరెంట్ ఎప్పుడు వస్తుం దని సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఎవరూ స్పం దించ లేదు.

-మిట్ట పవన్, శింగనమల

వైభవంగా అక్కదేవతల ఉత్సవాలు



అలంకరణలో అక్కదేవతలు

ఆత్మకూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్న అక్కదేవతల పరుష ఉత్సవాలు మండల కేంద్రమైన ఆత్మకూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్ల గిరిగెలకు గ్రామ సమీపాన ఉన్న కొలను వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని వెదురు గంపలో ఉంచి గ్రామంలోని జయరాం కాలనీలో ఉన్న మంచినీటి బావి వద్ద, సత్రం వద్ద ఉంచి పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. బుధవారం ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. ఆలయం చుట్టూ పన్నారపు బండ్లు తిప్పి రైతులు మొక్కులు తీర్చుకుంటారు. ఉత్సవాల సందర్భంగా గ్రామస్థులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

'చట్టసభల్లో బీసీలకు 43శాతం రిజర్వేషన్ ఇవ్వాలి'

అనంతపురం క్లాక్‌టవర్, మే 13(ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభల్లో, విద్య, ఉద్యోగాలలో 43శాతం రిజర్వేషన్లు కల్పించాలని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి, రిజర్వేషన్ల ఎంప్లాయీస్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు నాగరాజు కోరారు. స్థానిక రామ్‌నగర్‌లోని యాదవ్‌భవన్‌లో మంగళవా రం నిర్వహించిన సమావేశంలో నాగరాజు మాట్లాడారు. కులగణన చేపట్టేందుకు అంగీకరించిన కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మన్నారు. కులగణనకు సహకరించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, జనసేన, బీజేపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌పీఎస్ నాయకులు విఠల్‌గౌడ్, ఆర్ఈఎఫ్ నాయకులు జి నాగభూ షణం, నారాయణనాయక్, నాగభూషణం పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణపై కలెక్టర్ దృష్టి



కాలనీ వాసులతో ఆరాతీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

- పలు కాలనీల్లో తనిఖీలు
- చెత్తాచెదారం ఉండటంపై ఆగ్రహం
- ప్లాస్టిక్ నిషేధం అమలుకు ఆదేశాలు

అనంతపురం టౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, గ్రామాల్లో పరిశుభ్రతపై కలెక్టరు వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉరవకొండ నియోజకవర్గంలోని చాయాపురానికి వచ్చినపుడు పరిశుభ్రతపై ప్రత్యేకంగా ఆదేశాలిచ్చారు. దీంతో కలెక్టరు మూడురోజులుగా ఇంటింటా చెత్తసేకరణ, పరిశుభ్రతపై చర్యలు తీసు కుంటున్నారు. అందులో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని నిర్మలానందనగర్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆ కాలనీలో తిరుగుతూ పరిశుభ్రతను పరిశీలించారు. ఎక్కడ చూసినా చెత్తచెదారం కనిపించడంతో నగరపాలక అధికారులు, సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంతంలోని పలు ఇళ్ల వద్దకు వెళ్లి ప్రతి రోజూ ఇంటింటికి వచ్చి చెత్తను తీసికెళుతున్నారా అని ఆరా తీశారు. రెండు రోజులకోసారి వస్తున్నారని కొందరు చెప్పగా, సక్రమంగా రావడంలేదని మరికొందరు కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నగరపాలక సంస్థ పనితీరు పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

పరిశుభ్రతలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నగరం, అందులో జిల్లా కేంద్రం పరిశుభ్రత విషయంలో ఆదర్శంగా ఉండాలని, ఎవరు నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. రోజూ ఉదయం6 గంటల నుంచి ఇంటింటికెళ్లి తడి, పొడి చెత్త సేకరించాలన్నారు. వ్యాపార దుకాణాలున్న ప్రాంతంలో ప్రతి రోజు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. శానిటేషన్ సెక్రెటరీలు ఉదయమే ఫీల్డ్‌కు వచ్చి చెత్తసేకరణపై పర్యవేక్షించాలన్నారు. దుకాణాల వద్దే చెత్తను వేస్తే వాటి యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు ప్లాస్టిక్ నిషేధంపై కఠినంగా వ్యవహరించా లన్నారు. నగరపాలక కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ చంద్రశేఖర్, మున్సిపల్ వైద్యాధికారి నరసింహ, ఈఈ షకీల్, శానిటేషన్ సెక్రెటరీ శర్మాస్ తదితరులు పాల్గొన్నారు.

మెడికోల మెస్ బిల్లుల మస్కాపై విచారణ

అనంతపురం టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : వైద్యకళాశాలలో చదువుతున్న ఎంబీబీఎస్ విద్యార్థినుల నుంచి వసూలు చేసిన మెస్ బిల్లుల మస్కాపై విచారణ మొదలైంది. నెలవారీగా మహిళా మెడికోల తో వసూలుచేసిన డబ్బును హాస్టల్ ఖాతాల్లోకి జమచేయకుండా అకౌంటెంట్ వ్యక్తిగత ఖాతాల్లోకి జమచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీపిపై ఆంధ్రజ్యోతిలోను ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ అక్రమ వ్యవహారంపై విచారణకు ముగ్గురు డాక్టర్లు ఉమామహేష్, మధుసూదన్, సరళను మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం విచారణ కమిటీ మెస్ బిల్లుల డబ్బు పక్క దారిపై విచారణ మొదలు పెట్టినట్లు వైద్య వర్గాల ద్వారా తెలిసింది.

అంగన్‌వాడీ కార్యకర్తపై పిర్యాదు

రామగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకొండాపురం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త తన విధులు సరిగా నిర్వర్తించడం లేదని గ్రామస్థులు మంగళవారం సీడీపీఓకు పిర్యాదు చేశారు. ఆమె రోజూ ఉదయం 10-30 గంటలైనా అంగన్‌వాడీ కేంద్రానికి రారని, ఒక్కో రోజు కేంద్రాన్ని తెరవరన్నారు. గర్భిణులు, బాలింతలకు అందించే బాలామృతం, గుడ్లు, పాలు సరిగా ఇవ్వడంలేదన్నారు.

'పరీక్ష ఫీజు కట్టని కాలేజీపై చర్య తీసుకోండి'

అనంతపురం విద్య, మే 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించకుండా ఓ విద్యార్థి ఏడాది జీవితాన్ని వృథా చేసిన కళాశాలపై చర్య తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థి సమాఖ్య నాయకులు మంగళవారం ఆర్ఐఓ ఆఫీస్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భం గా నాయకులు కుళ్లాయిస్వామి, పరమేష్, సురేష్ తదితరులు మాట్లాడుతూ... శ్రీ విజన్ కాలేజ్‌లో కీర్తన అనే విద్యార్థి సెకెండ్ ఇయర్ వరకు చదివిం దన్నా రు. అయితే ఫస్ట్ ఇయర్‌లో గణితం -1ఏ పెండింగ్ ఉండటంతో గతనెల 22 న విద్యార్థిని తండ్రి కాలెజి వాళ్లకు రూ. 1500 ఫోన్ పే చేశారన్నారు. పరీక్ష ఫీజు రూ. 650 కాగా, ఏకంగా 1500 వసూలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. కళాశాల నిర్లక్ష్యంగా బోర్డుకు ఫీజు చెల్లించలేదన్నారు. తక్షణమే ఆ కాలేజ్‌ను సీజ్ చేయాలంటూ ఆర్ఐఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందించారు.

నీటి పథకం కార్మికులతో అధికారుల చర్చలు విఫలం

అనంతపురం న్యూటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగు నీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం 38వ రోజుకు చేరింది. దీంతో కార్మిక సంఘం నాయకులతో ఆర్డీఓ కేశవరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, ఈఈ మురళీధర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ మహబుబ్‌బాషా, వీఆర్వో లక్ష్మన్న వారు సమ్మె చేపట్టిన పీఏబీఆర్ డ్యామ్ వద్ద మంగళవారం చర్చలు జరిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబులు, కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ... ఇప్పటికే అధికారుల చెప్పిన హామీలతో చాలాసార్లు సమ్మె విరమిస్తూ వచ్చామన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించిన తరు వాతే సమ్మె విరమిస్తామన్నారు. సమ్మె కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు. ఈ చర్చల్లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, సీఐటీయూ నాయకులు స్వామి, రాము, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

'దళిత రైతులకు న్యాయం చేసే వరకు పోరాటం'

శింగనమల, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన దళిత రైతులకు డి పట్టా ఇచ్చి, రీసర్వే సమయంలో అధికారులు నిర్లక్ష్యం వల్ల ఆన్‌లైన్ నుంచి తొలగించి వారికి అనాయ్యం చేశారని జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటింగ్ కమిటీ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న, బండారు కుళ్ళాయప్ప పేర్కొన్నారు. ఆ దళిల రైతుకు న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు. ఆంధ్రజ్యోతిలో మంగళవారం 'వైసీపీ పాపం... దళిత రైతులకు అన్యాయం' అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు స్పందించారు. వారు శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్‌రావును కలిసి దళిత రైతులకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

భారీ వర్షం

పొంగిన వాగులు, వంకలు



ప్రవహిస్తున్న ప్యాదిండి వంక



రామగిరి చెరువులోకి చేరుతున్న వంకనీరు

చెన్నేకొత్తపల్లి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం తెల్లవారుజామునభారీ వర్షం కురిసింది. 74.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. ఈ వర్షానికి పలు గ్రామాల్లో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. వేసవిలో పూర్తిగా ఎండిపోయిన చెక్‌డ్యాంలు, కుంటలకు జలకళ సంతరించుకుంది. చెన్నేకొత్తపల్లి పెద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో ఉదయం కొన్ని గంటల పాటు రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దమొగలాయపల్లి, ప్యాదిండితో పాటు పలు చిన్న చిన్న వంకలు ప్రవహించాయి. నాగసముద్రం, మేడాపురం తదితర చెరువుల్లోకి కొంతమేర నీరు చేరింది. ఈ వర్షంతో కొద్ది మేర భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు.

● రామగిరి: మండలంలో మంగళవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున 4-30గంటల నుంచి 5-30 వరకు కుండపోత వర్షం పడింది. మే నెలలో ఎన్నడూ లేనివిధంగా కుండ పోత వర్షం కురవడంతో రైతలు హర్షం వ్యక్తం చేస్తున్నా రు. ఈ వర్షానికి కుంట లు, చెక్‌డ్యాంలు నిండాయి. రామగిరి చెరువులోకి వంక పారింది. ఎక్కడ చూసినా గుంతల్లో నీరు కనబడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నా రు. అయితే ఇంకా అక్కడక్కడ కోతకోయని వరి మడులు ఉన్న రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

ఐదు బృందాలతో రీ సర్వే

కూడేరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఐదు బృందాలతో భూముల రీ సర్వే వేగవంతం చేసినట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ దబ్బర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కొర్రకోడు గ్రామ రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న రీసర్వేను అధికారులు తనిఖీ చేశారు. సర్వే సమయంలో రైతులతో సమావేశమై కొలతలు వేయాలని, అభ్యంతరాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని రైతులకు తెలియజేశారు.

పేకాట స్థావరంపై దాడి: రూ. 3.22 లక్షల స్వాధీనం

బ్రహ్మసముద్రం, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొబ్బర్లపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి పెద్దఎత్తున నగదు, ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం పొబ్బర్లపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేసి 13 మందిని పట్టుకుని వారి వద్ద నుంచి రూ. 3,22,990 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● తాడిపత్రి : మండలంలోని చుక్కలూరు గ్రామం ఫ్యాక్టరీ శివార్లలో మంగళవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టుచేసి రూ.37,210 నగదుతోపాటు ఐదు మొబైల్‌ఫోన్లు సీజ్ చేశామని రూరల్ ఎస్ఐ కాటయ్య తెలిపారు. పట్టణ ఎస్ఐ గౌస్ బాషా, సిబ్బంది కలిసి పేకాటస్థావరంపై దాడులు చేశామన్నారు.

ప్రిన్సిపాల్‌గా వెంకటనారాయణ

తాడిపత్రి, మే13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెంకటనారాయణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం ఓల్డ్‌టౌన్ జూనియర్ కళాశాల లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై వెంకటనారాయణ ఇక్కడకు బదిలీ అయ్యారు.

చెత్త సంపద కేంద్రాల తనిఖీ

తాడిపత్రి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావివెంకటాంపల్లి, గన్నెవారిపల్లి, చల్లవారిపల్లిలోని చెత్తసంపద కేంద్రాలను మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో చెత్త సేకరణ, పరిశుభ్రత నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

20న కాలవ ఫౌండేషన్ క్రికెట్ పోటీలు

బొమ్మనహాళ్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 20న కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రవిచంద్ర, రమేష్, రవి తెలిపారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కేసీఎల్-2 పేరుతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ. 30 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు ఇస్తామన్నారు.

దంచికొట్టిన వాన.. నీట మునిగిన పంటలు



కంబదూరు మండలం అండేపల్లి వద్ద టమోటా పంటలో నిలిచిన వర్షపునీరు, కుందుర్పిలో నీటమునిగిన మొక్కజొన్న, యాడికిలో నేలకొరిగిన నిమ్మచెట్లు

కళ్యాణదుర్గం, మే 13(ఆంధ్రజ్యోతి) : వర్ష బీభత్సం రైతులకు కన్నీటిని మిగిల్చింది. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి రైతులు సాగు చేసిన పంటలన్నీ వర్షార్పణమయ్యాయి. కంబదూరు మండలం అండేపల్లికి చెందిన రైతు కురుబ శేఖర్ సాగుచేసిన టమోటా, కర్బూజా పంటంతా వర్షం ధాటికి మునిగింది. మూడు ఎకరాలలో కర్బూజ పంట, మరో మూడు ఎకరాలలో టమోటా పంటను సాగు చేశాడు. ఈ రెండు పంటలకు సుమారు రూ. మూడు లక్షలు ఖర్చు చేశాడు. కర్బూజా పంటలో నీరంతా నిలబడి మొలకదశలోనే కొట్టుకుపోయింది. మరో మూడు ఎకరాలలో టమోటా పంట సాగుచేశారు. టమోటా పంటంతా నీరు నిలిచి రైతు నష్టానికి గురయ్యాడు. కంబదూరు చెరువు కట్టకింద సాగు చేసిన వరి పంట మొత్తం కొట్టుకుపోయింది.

●కుందుర్పి : మండలంలో మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి పంట పొలాలు నీట మునిగాయి. కరిగానపల్లి రైతు ఈరన్నకు చెందిన మొక్కజొన్న పూర్తిగా నీట మునిగింది. ఒక మోస్తరు వర్షం కురవడంతో చెక్ డ్యాములు పొంగిపొర్లుతున్నాయి.

● యాడికి : మండలంలో సోమవారం రాత్రి వాన దంచికొట్టింది. వర్షపాతం 50మి.మీగా నమోదైంది. యాడికి సమీపంలో పలుచోట్ల ఫాంపాండ్లు వర్షపునీటితో జలకళను సంతరించుకున్నాయి. బలంగా వీచిన గాలులకు యాడికి చెందిన బయన్న, రమేష్ అనే రైతుల తోటల్లో 35 నిమ్మ చెట్లు నేలకొరిగాయి. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. రాత్రి 11:50 గంటలకు ప్రారంభమైన వర్షం 2గంటలపాటు ఏకధాటిగా కురిసింది. నేలకొరిగిన నిమ్మచెట్లను సీపీఐ మండల కార్యదర్శి రఫీ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడుయాదవ్ పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, కుళ్లాయిరెడ్డి పాల్గొన్నారు.

హంస వాహనంపై నారసింహుడు



హంస వాహనంపై దర్శనమిస్తున్న స్వామి వారు

ఉరవకొండ, మే 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం హంసవాహనంపై నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి సుప్రభాతసేవ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి, హంస వాహనం పై కొలువుదీర్చారు. కార్యక్రమానికి వేలూరు రంగయ్య, కుటుంబసభ్యులు దాతలుగా వ్యవహరించారు. బుధవారం హనుమంత వాహనోత్సవం నిర్వహిస్తారు.

చికిత్స పొందుతూ యువతి మృతి

బెళుగుప్ప, మే 13 (ఆంధ్రజ్యోతి) :మండల కేంద్రానికి చెందిన మౌనిక (28) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. తండ్రి వన్నూరు స్వామి తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం నుంచి గత నెల 29న కంపెనీలోకి విధులకు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డారు. తలకు బలంగా గాయాలు కావడంతో మెరుగైన వైద్య పరీక్షలకు బెంగళూరు ఆస్పత్రికి తరలించగా మంగళవారం ఉదయం మరణించారు.

కసాపురంలో ప్రాకారోత్సవం



గుంతకల్లుటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి ఆంజనేయస్వామి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని వెండి రథంలో కొలువుదీర్చి పూజలు చేశారు. మేళతాళాల మధ్య ఆలయ ప్రాంగణంలో స్వామి వారి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. నెట్టికంటి ఆంజనేయస్వామికి కర్నూలు జిల్లా జొన్నగిరికి చెందిన రామాంజనేయులు, పార్వతి దంపతులు రెండు వెండి గిన్నెలు, రెండు స్పూన్లు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపీపీ

బ్రహ్మసముద్రం, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యులు మండల అభివృద్ధి కోసం చేయవలసిన పనులను అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతమ్మ, ఎంపీడీవో నందకిషోర్ ఈవోపీఆర్డీ రంగనాయకులు, డాక్టర్ రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

మెడికల్‌షాపు నిర్వాహకులతో సమావేశం

తాడిపత్రి, మే13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కల్యాణమండపంలో మంగళవారం మెడికల్‌షాపు రిటైల్, హోల్‌సేల్ యజమానులతో జిల్లా ఔషధ నియంత్రణ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్‌షాపు నిర్వాహకులు యాంటిబయోటిక్స్, నార్కొటిక్స్ డ్రగ్స్‌ను నివారించాలని, ప్రిస్కిప్షన్ లేకుండా మందులు విక్రయించకూడదని తెలిపారు.

తాగునీటి కార్మికుల చర్చలు విఫలం

సమ్మె కొనసాగిస్తాం : ఓబులు



మాట్లాడుతున్న ఓబులు

కూడేరు, మే 13(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులతో అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో కార్మికుల సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ రాష్ట్ర నేత ఓబులు తెలిపారు. మండలంలోని పీఏబీఆర్ డ్యాంలోని నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం ప్లాంట్ వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్‌బాబు, ఈఈ మురళీధర్, డీఈ శిరీష, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. ఓబులు మాట్లాడుతూ.. నెలల తరబడి వేతనాలివ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని అధికారులను నిలదీశారు. అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో సమ్మె కొనసాగుతుందని ఓబులు తెలిపారు. చర్చల్లో ఆయనతోపాటు జిల్లా ప్రధానకార్యదర్శి నాగేంద్రకుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామం బాగుకోసం ఆలోచించండి : జేసీపీఆర్



రోడ్డును ప్రారంభిస్తున్న జేసీపీఆర్

యాడికి, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రామం బాగుకోసం మనమేమి చేశామని ప్రతి ఒక్కరూ ఆలోచిస్తే ఆ ఊరు కచ్చితంగా అభివృద్ధి చెందుతుందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. రూ.9.25 కోట్ల వ్యయంతో నిర్మించిన రాయలచెరువు- డీన్ రోడ్డును మంగళవారం చందన గ్రామంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన రోడ్డు పనులను వేగవంతంగా జరిగేలా చేసి పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఏఈఈ లక్ష్మి, తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, చందన సర్పంచు నారాయణమ్మ, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, రుద్రమనాయుడు, రామాంజనేయులు, పరిమి చరణ్, సూర్యనారాయణరెడ్డి, ధనుంజయ, రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, బాబుగౌడ్, సుధాకర్‌నాయుడు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు. రైతుల సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరులో అగ్రస్థానం: ఎమ్మెల్యే



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, మే 13(ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో మరే ఇతర నియోజకవర్గానికి ఇవ్వని విధంగా గుంతకల్లుకు అత్యధికంగా సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సహాయాలు మంజూరవుతున్నాయని ఎమ్మెల్యే గుమ్మనూరు జయ రాం పేర్కొన్నారు. మంగళవా రం టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం 19 మం దికి రూ. 8,52,178 చెక్కులను మంజూరుకావడంతో లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, పాల మల్లికార్జున, కృపాకర్, ప్రభాకర్, పత్తి హిమబిందు, అంజి, హనుమతు, మహమ్మద్ ఖాజా, ఫజులు, యూసుఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

వెంకటశివుడు యాదవ్‌కు సన్మానం



వెంకటశివుడును సన్మానిస్తున్న నాయకులు

గుంతకల్లు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమితులైన వెంకట శివుడు యాదవ్‌ను మంగళవారం గుత్తిలోని ఆయన స్వగృహంలో గుంతకల్లు పట్టణ ముస్లిం నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మహమ్మద్‌ఖాజా, యూసుఫ్, వలి బాష, ఫజులు, మహబూబ్ బాష, శిల్పిబాష, రహంతుల్లా, వలి పాల్గొన్నారు.

● పుట్లూరు : టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌కు కార్మిక సంక్షేమ బోర్డు పదవి ఇవ్వడంతో పార్టీ మండల కన్వీనర్ బాలరంగయ్య, మాజీ సర్పంచు శ్రీనివాసులునాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

శేషవాహనంపై ఊరేగిన ప్రసన్న వెంకటరమణుడు



శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రాయదుర్గం, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శేషవాహనంలో ఊరేగించారు. ఉదయాన్నే స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం స్వామి వారిని శేషవాహనం లో ప్రతిష్ఠించి శ్రీవారి ఊరేగించారు. కార్యక్రమంలో కురిహిన శెట్టి, స్వకులసాలె, ఆర్ఎస్ఎస్, స్మార్ట్ ఫ్రెండ్స్ గ్రూపు, స్మార్ట్ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండు వేర్వేరు ఇళ్లలో చోరీ

తాడిపత్రి, మే13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణాపురం 3వరోడ్డు, 7వరోడ్డులో రెండుచోట్ల చోరీలు జరిగాయని పట్టణ ఎస్ఐ గౌస్‌బాషా మంగళవారం తెలిపారు. కృష్ణాపురం 3వరోడ్డులో శాంతి అనే ప్రైవేట్ టీచర్ మధురైకి బంధువుల ఊరికి వెళ్లి తిరిగి వచ్చేసరికి చోరీ జరిగిందన్నారు. జత కమ్మలు, రూ.80వేలు నగదు చోరీ అయిందని తెలిపారు. కృష్ణాపురం 7వరోడ్డులో రాజేశ్వరి, రఘునాథరెడ్డి దంపతులు ప్రైవేట్ టీచర్లుగా పనిచేస్తున్నారు. వారం క్రితం బెంగళూరుకు వెళ్లి సోమవారం ఇంటికి వచ్చి చూడగా నాలుగున్నర తులాల బంగారు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

వీరజవాన్‌కు నివాళి

గుంతకల్లుటౌన్, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ శంకరానందా గిరి స్వామి డిగ్రీ కళాశాలలో మంగళవారం వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్ మురళీనాయక్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ ఆర్. సురేష్‌బాబు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జి. ప్రకాష్, ఆధ్యాపకులు క్రిష్ణయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణానంద, వెంకటసుబ్బమ్మ, సుభాషిణి, సువర్ణ, అమీర్, మహేష్, ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

డ్రైవర్లకు బీమా కల్పించాలి

యాడికి, మే 13(ఆంధ్రజ్యోతి): వాహన డ్రైవర్లకు రక్షణ, ప్రమాదబీమాను ప్రభుత్వం కల్పించాలని సేఫ్టీ డ్రైవర్స్ అ సోసియేషన్ సౌత్‌ఇండియా అధ్యక్షుడు అన్వర్‌బాషా తెలిపారు. మంగళవారం యాడికిలో ప్రైవేట్ వాహన డ్రైవర్ల అ సోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ వాహనాల డ్రైవర్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రైవేట్ వాహన డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేయాలని కోరారు. సమావేశంలో సభ్యులు రసూల్, శ్రీరాములు, వెంకటయ్య, ఫరూక్, కంబగిరి, రసూల్, మహమ్మద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

గుత్తి, మే 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 15న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గుత్తికి వస్తున్న సందర్భంగా దీనిపై ఆయన దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బాలాజీ, ప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించాలి

గుత్తి, మే 13(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఉద్యమించాలని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం గుత్తి డివిజన్ విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా మని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ రాఘవరెడ్డి పే ర్కొన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గుత్తి డివిజన్ అధ్యక్షుడిగా లక్ష్మీకాంతరెడ్డి, కార్యదర్శి గా షేక్షావలి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజునాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వెంకటరామిరెడ్డి, కోశాధికారి రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రమేష్



గుంతకల్లుటౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన కసాపురం రమేష్ నియమితులయ్యారు. అనంతపురంలో మంగళవారం డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలు జరిగాయి. ఈ మహాసభలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కసాపురం రమేష్‌తో పాటు 24మంది జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నిరుద్యోగ సమస్యలపై రాబోయే రోజుల్లో పోరాటాలను కొనసాగిస్తామని రమేష్ తెలిపారు.

సెమినార్‌కు తాడిపత్రి క్రీడాకారులు ఎంపిక



సెమినార్‌కు వెళుతున్న క్రీడాకారులతో కోచ్ సాయిబాబా

తాడిపత్రి, మే 13(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని రాజీవ్‌స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 12 నుంచి 15వరకు జరుగుతున్న మూడో జాతీయ తైక్వాండో ఫైట్ టెక్నిక్ సెమినార్‌లో తాడిపత్రిలోని అయాన్ తైక్వాండో అకాడమి క్రీడాకారులు పాల్గొననున్నట్లు తైక్వాండో జిల్లా కార్యదర్శి సాయిబాబా తెలిపారు. నాగమోక్షిత, హర్షవర్ధన్‌రెడ్డి, రాహుల్ పాల్గొంటారని అన్నారు. ఇరాన్ దేశం నుంచి వరల్డ్ చాంపియన్‌షిప్ ప్లేయర్ అబ్బాస్‌షేకి శిక్షణ ఇస్తారని తెలిపారు.